ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-05-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

ముఖ్యాంశాలు

- కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ఆక్వా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో పరిశీలిస్తోందని మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు.
- రాష్ట్రంలో ఎండల తీవ్రత, పిడుగులతో కూడిన వర్షాలతో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 134వ సంచిక ఈనెల 31న ప్రసారమవుతుంది.

==================

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించడంతో రాష్ట్రాన్ని పునర్ నిర్మించుకునే అవకాశం కలిగిందన్నారు. క్లస్టర్ల విధానంలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ కార్యక్రమమైన మహానాడును ఉద్దేశించి మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ప్రధాన వేదిక నుండి ఆయన ఈరోజు ప్రసంగించారు. క్షేత్ర స్థాయిలో పర్యటనలతో పాటూ, కలెక్టర్ల సదస్సులు, మంత్రివర్గ సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యంతో పని చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==================

ఆక్వా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో పరిశీలిస్తోందని మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రొయ్యల దాణా ధరల పెరుగుదల, ముడి పదార్థాల కొరత, రైతులపై పెరుగుతున్న వ్యయభారం, ఎగుమతుల సవాళ్లు వంటి అంశాలపై మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో సంబంధిత భాగస్వాములు, వర్గాలతో మంత్రి అచ్చెన్నాయుడు ఈరోజు మాట్లాడారు. ప్రస్తుతం కొనసాగుతున్న వేసవి పంట సమయంలో దాణా ధరల పెంపు రైతులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని, అదే సమయంలో దాణా పరిశ్రమ కూడా ముడి పదార్థాల ధరల పెరుగుదలతో ఒత్తిడిని ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా, పరిశ్రమ నిలదొక్కుకునేలా సమతుల్య నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఫీడ్, సీడ్ నాణ్యతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, CCTV ఆధారిత హ్యాచరీ పర్యవేక్షణ, సీడ్ ట్రేసబిలిటీ, IOT ఆధారిత మానిటరింగ్ వంటి సాంకేతిక చర్యలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. GM సోయా దిగుమతులు, ఫిష్ మీల్ లభ్యత, దిగుమతి లైసెన్సులు, ఎగుమతి పోటీతత్వం వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపనున్నట్లు మంత్రి వెల్లడించారు.

===================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 134వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు రేపు సాయంత్రం వరకు పంపవచ్చు.

===================

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) సన్నాహకాల్లో భాగంగా బి.ఎల్.ఓ.లకు అందజేసే కిట్లను విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఈరోజు ఆయన ఛాంబర్‌లో పరిశీలించారు. వచ్చే నెల 15 నుంచి జూలై 14 వరకు చేపట్టనున్న SIR ప్రక్రియలో భాగంగా బి.ఎల్.ఓ.లు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించేందుకు అవసరమయ్యే కిట్లను ఎన్నికల సంఘం అందజేస్తోంది. ఆ కిట్లలో స్టేషనరీ సామగ్రితో పాటు గొడుగు, వాటర్ బాటిల్ కూడా అందజేయనున్నారు. జిల్లాలోని 1,847 మంది బి.ఎల్.ఓ.లకు రేపటి నుంచి ఈ కిట్లను పంపిణీ చేయాలని కలెక్టర్ సూచించారు.

===================

ఏలూరు జిల్లా కైకలూరులో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ మహా ప్రశిక్షణ అభియాన్–2026 కార్యక్రమం ఈరోజు ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రశిక్షణ వర్గానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ముఖ్యవక్తగా హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ ప్రతిపాదించిన అంత్యోదయ సిద్ధాంతమే బీజేపీ ఆలోచనా విధానానికి మూలమని పేర్కొన్నారు.

విరామం

===================

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం రైతుల పాలిట ఓ సంజీవనిలా దోహదపడుతుందని బాపట్ల జిల్లాకు చెందిన లబ్దిదారుడు కుమార్ తెలిపారు. పంట సాగు సమయంలో ఏ విధమైన నష్టం వాటిల్లినా తీవ్రంగా నష్టపోయేవాళ్లమని.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం తీసుకువచ్చిన పీఎం ఫసల్ బీమా యోజన ఆ నష్టాన్ని నివారిస్తోందని చెప్పారు. ఈ పథకం ద్వారా ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్లు, వ్యాధుల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. సుస్థిరమైన వ్యవసాయ రంగానికి పీఎం ఫసల్ బీమా యోజన ఎంతో ఉపకరిస్తుందని రైతు కుమార్ ఆకాశవాణికి తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

===================

నైరుతి రుతుపవనాలు రానున్న రెండు మూడు రోజుల్లో నైరుతి, ఆగ్నేయ అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, లక్షద్వీప్ ప్రాంతం, తూర్పు మధ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతం, ఆగ్నేయ బంగాళాఖాతంలోని మిగిలిన భాగాలకు మరింతగా విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అదే విధంగా ఉత్తర-దక్షిణ ద్రోణి ప్రస్తుతం ఉత్తర జార్ఖండ్ నుండి ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్ వరకు ఒడిశా మీదుగా సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని పేర్కొంది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తాంధ్రలో రేపు తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకటరావు తెలియజేస్తూ..

(వాయిస్ 25 సెకన్లు)

===================

రాష్ట్రంలో ఎండల తీవ్రత, పిడుగులతో కూడిన వర్షాలతో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో ఈరోజు 45.2 డిగ్రీలు, ఏలూరు జిల్లా ధర్మాజీగూడెంలో 45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు. అలాగే 14 జిల్లాల పరిధిలోని 110 మండలాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయని ఆయన వెల్లడించారు. ఇక రేపు 79 మండలాల్లో తీవ్ర వడగాలులు, 152 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల మధ్య ప్రయాణాలను వాయిదా వేసుకోవాలన్నారు. బయటకు వెళ్లేవారు తప్పనిసరిగా మంచినీరు వెంట తీసుకుని వెళ్లాలని కోరారు. పిడుగులతో కూడిన ఆకస్మిక వర్షాలు కురిసేటప్పుడు చెట్ల కింద నిలబడరాదని సూచించారు.

===================
===================